క్లుప్తంగా

దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత ఉపకరణాల పంపిణీ నేడు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత పరికరాలు అందజేయనున్నట్లు కమిషనర్ అలీంబాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులకు ఆర్టిఫిషియల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(అలింకో) ఆధ్వర్యంలో ఏడీఐపీ, ఆర్‌వీవై పథకం కింద ఉచితంగా ఉపకరణాలు, సహాయ పరికరాలు అందజేస్తామని తెలిపారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పంపిణీ చేయనున్నామని అన్నారు.

దుగ్గిరాల: దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాలు, సహాయ పరికరాల పంపిణీ జరుగుతుందని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి సోమవారం ఓ ప్రకటన వెలువడింది. ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు సంబంధిత వివరాలను తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మంగళగిరిలోని ఈద్గా కమ్యూనిటీ హాల్‌లో జరిగే శిబిరానికి వారు హాజరుకాగలరని అన్నారు. అర్హులకు పరికరాలు ఇచ్చే సమయాన్ని తర్వాత తెలియజేస్తారన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఫిరంగిపురం: మండలంలో రేపూడి గ్రామంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి మాతృమూర్తి చిట్టా ఈశ్వరమ్మ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సోమవారం చిట్టా విజయభాస్కరరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్టా బాపూజీరెడ్డి, కృష్ణజాల రెడ్డిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, నూనె ఉమామహేశ్వరరావు, డి.సురేష్, షేక్ సలీం, చిట్టా అంజిరెడ్డి, షేక్ మస్తాన్‌వలి, సంజీవరెడ్డి, పెరికల చిన్నా, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆటో



తాడేపల్లి రూరల్: ఉండవల్లి అమరావతి రోడ్డులో సోమవారం తెల్లవారుజామున విద్యుత్ స్తంభాన్ని ఆటో ఢీకొంది. డ్రైవర్ అతివేగంగా రావడంతో ఢీకొన్న విద్యుత్ స్తంభం విరిగిపోయింది. ఉలిక్కిపడి నిద్రలేచిన స్థానికులు ఏం జరిగిందో తెలుసుకునే లోపే ఆటో డ్రైవర్ పరారయ్యాడు. మద్యం మత్తులో ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. స్థానికుల సమాచారంతో తాడేపల్లి పోలీసులకు సంఘటనా స్థలానికి చేరుకుని ఆటోను స్టేషన్‌కు తరలించారు. విద్యుత్‌శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆటో నంబర్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు.

పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

ఫిరంగిపురం: పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాహక్కు చట్టాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఎంఈవోలు షేక్ మహబూబ్ సుబానీ, రవికాంత్‌లు అన్నారు. ఎంఈవో కార్యాయలయంలో సోమవారం వారు మాట్లాడుతూ.. 2009 విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పారు. దానిలో భాగంగా అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25శాతం సీట్లు వెనకబడిన వర్గాలు, ఆర్థిక బలహీన వర్గాల పిల్లలకు రిజర్వు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఈనెల 19లోపు ఆన్‌లైనులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌కు విద్యార్థుల జనన, నివాస, ఆధార్, రేషన్ కార్డులు తీసుకువెళ్లాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం



దుగ్గిరాల: ఉద్యోగులకు ప్రభుత్వానికి వారధిలా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పనిచేస్తుందని ఏపీజీఈఏ గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ బాషా అన్నారు. దుగ్గిరాలలోని సాంఘీక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జూన్ మొదటి వారంలో కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సమావేశం జరుగుతుందని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సీపీఎఫ్ విధానం రద్దు, పాతపెన్షన్ విధాన ప్రవేశం తదితర అంశాలపై చర్చ జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో దుగ్గిరాల తాలూకా అధ్యక్షులు అందె బాలచంద్రమౌళి, వి.సుబ్బారావు, జి.పూర్ణప్రసాద్, చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసం కొత్త చట్టాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

తాడికొండ: దివ్యాంగుల కోసం కొత్త చట్టాలు వచ్చాయని.. వారిని ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయో వృద్ధులకు ఉపకరణాలు, సహాయ పరికరాల పంపిణీ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దివ్యాంగుల పట్ల వివక్ష చూపకూడదని, వారిని ఆదరించాలన్నారు. వృద్ధాప్యంలోని తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత పిల్లలపై ఉందని.. ఎవరైనా వారి పోషణ పట్ల అశ్రద్ధ వహిస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వైద్య పరీక్షల అనంతరం దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సమతా వాణి, అలింకో సంస్థ క్యాంపు ఇన్‌చార్జి ప్రసన్న కుమార్, పీఅండ్‌వో వైద్యులు విక్రమ్ మహారాణా, కాన్పూర్‌కు చెందిన డేటామేన్ బిపిన్ పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికవర్గ ఆశాజ్యోతి కారల్ మార్క్స్



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మంగళగిరి టౌన్: ప్రపంచ కార్మికవర్గపు ఆశాజ్యోతి కారల్ మార్క్స్ అని పలువురు సీపీఐ నాయకులు అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సామాజిక శాస్త్రవేత్త, సోషలిస్ట్ విప్లవకారుడు కారల్ మార్క్స్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. కారల్ మార్క్స్ జీవనం, సిద్ధాంతాలు ప్రపంచ వ్యాప్తంగా సోషలిజం, కమ్యూనిజం ఉద్యమాలకు పునాదిగా మారాయన్నారు. అంతర్జాతీయ సమైక్యతను స్థాపించడం ద్వారా కార్మిక ఉద్యమానికి పునాది వేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, నియోజక వర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ పార్లర్‌లో చోరీ

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని ఓ డెయిరీ పార్లర్‌లో చోరీ జరిగిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. దుకాణ యజమాని శైలజ తెలిపిన వివరాల ప్రకారం.. విజయ డెయిరీ పార్లర్‌తో పాటు ఫ్యాన్సీ షాపు నడుపుతున్న ఆమె ఆదివారం రాత్రి 10.30 గంటలకు దుకాణాన్ని యథావిధిగా మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు పాలు విక్రయించేందుకు రాగా.. షాపు షట్టర్ పగలగొట్టి గల్లాపెట్టెలోని రూ.20 వేలు, కొంత విలువైన బంగారు వస్తువులు మాయమైనట్లు గమనించామని అన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం పోరాడుతూనే ఉన్నారని.. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికులకు నష్ట పరిహారం మాత్రం అందడం లేదని అన్నారు. కార్యక్రమంలో విజయశ్రీ, రమణ, సువర్ణకుమారి, సారమ్మ, సుబ్బారావు, పిచ్చయ్య, గురవయ్య, ఇమాంబి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మార్చురీ బాక్స్ వితరణ

మంగళగిరి టౌన్: మంగళగిరి అంజుమన్ కార్యాలయానికి స్థానిక టీడీపీ నాయకులు షేక్ హుస్సేన్ తన తండ్రి జ్ఞాపకార్థం మార్చురీ బాక్స్, రెండు జనాజ సెట్లను అందజేశారు. నగర పరిధిలోని అంజుమన్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్రమ్, కార్యదర్శి హనీఫ్‌షా ఖాదరీలకు దాత షేక్ హుస్సేన్ ఇంతియాజ్ అందజేశారు. షేక్ అక్రమ్ మాట్లాడుతూ.. దాత హుస్సేన్ కుటుంబ సభ్యులు మార్చురీ బాక్స్, జనాజ సెట్లను అందించడం అభినందనీయమని అన్నారు. గతంలో హుస్సేన్ పేదలకు రిక్షాబండ్లు, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారని గుర్తుచేశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

తాడేపల్లి రూరల్: ప్రజా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. సోమవారం ఉండవల్లిలోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి మంగళగిరి నియోజకవర్గంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యలను వినతిపత్రం రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. వివిధ సమస్యతో బాధపడుతున్న సామాన్య ప్రజలకు అండగా ఉంటానని అన్నారు. ప్రతీ అర్జీని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించే వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా సోమవారం ఉపాధ్యాయుడు రాజు ఆంగ్లంలో మాట్లాడే విధానం, గ్రామర్ గురించి శిక్షణ ఇచ్చారు. రోజూ అభ్యాసం ద్వారా ఆంగ్లం పూర్తి స్థాయిలో మాట్లాడవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి పి.జేమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సుహాస్ శెట్టి ఆత్మశాంతికి ర్యాలీ



మంగళగిరి టౌన్: కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరులో హత్యకు గురైన సుహాస్ శెట్టి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ సోమవారం ఓమ్ శ్రీ మణిద్వీపం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కల్యాణనంద స్వామీజీ, దయానంద స్వామీజీ, బీజేపీ మంగళగిరి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు, యోగా గురువు రాధాకృష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన నిరాశ, నిరుత్సాహాన్ని మిగిల్చింది



సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల కాశయ్య

తాడేపల్లి రూరల్: ప్రధాని మోడీ అమరావతి పర్యటన నిరాశ మిగిల్చిందని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య అన్నారు. సోమవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరావతికి నిధులు ప్రకటన లేకపోవడం ప్రజల్లో నిరుత్సాహాన్ని నింపిందన్నారు. ప్రధాని 2015 అక్టోబర్ 22న ఇదే అమరావతికి తొలిసారి శంకుస్థాపనకు వచ్చినప్పుడు కనీసం మట్టి, నీళ్లు అయినా తెచ్చారని.. ఈసారి అది కూడా లేదని కేవలం మాటలతో మభ్యపెట్టడానికే వచ్చినట్లు ఉందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, కడప ఉక్కు పరిశ్రమ వంటి హామీలపై మోడీ స్పందించలేదని అన్నారు. డీసీఎం పవన్ కల్యాణ్ చేతిలో ఒక చాక్లెట్ పెట్టి వెళ్లారని విమర్శించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, మానికొండ డాంగే, బాషా, శ్యామ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన

రూ.50 లక్షల ఆర్థిక సహాయం అందజేసిన గుర్రం సంపత్ కుమార్



శంకుస్థాపన కార్యక్రమంలో నిర్వాహకులు

పెదవడ్లపూడి(మంగళగిరి): నగర పరిధిలోని పెదవడ్లపూడిలో నూతనంగా నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు సోమవారం శంకుస్థాపన చేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిప్పాన్ కోయి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ గుర్రం సంపత్ కుమార్ రూ.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్ చందు సైతం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్‌ను పలువురు నాయకులు అభినందించారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు యలవర్తి సాయికుమార్, దినేష్ కుమార్, ఫాదర్ గాగరిన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కారల్ మార్క్స్ జయంతి



కారల్ మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లి రూరల్: కారల్ మార్క్స్ జయంతిని తాడేపల్లి పట్టణ పరిధిలోని సీపీఐ కార్యాలయంలో నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడుతూ.. కార్మికుల కోసం, వారి సమస్యల పరిష్కారానికి పోరాడిన కారల్ మార్క్స్ మాటలను, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామన్నారు. కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు కావడానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. అమెరికాలో ఆర్థిక సంక్షోభం వచ్చిన తరువాతే దాస్ కాపిటల్ గ్రంథానికి అమ్మకాలు పెరిగాయని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు మానికొండ డాంగే, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, షేక్ బాషా, ప్రసాద్, శీలం శ్యామ్, లక్ష్మణ, తిరుపతమ్మ, హారిక శ్రీ, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

జన గణనలో కుల గణన చారిత్రక నిర్ణయం

తాడేపల్లి రూరల్: జన గణనలో కుల గణన చారిత్రక నిర్ణయం అని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు తాడేపల్లిలోని ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందని.. దేశంలో ఉన్న అన్ని కులాల జనాభా శాతంతో పాటు రాజకీయ, సామాజిక సమన్యాయం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా బీసీ కులాలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో బీసీలకు తమ వాటా ప్రకారం ప్రజా ప్రతినిధులు అవుతారని.. అప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నిధులున్నా నిలిచిన నాడు-నేడు పనులు

- 15 నెలలుగా నిలచిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు
- రెండు విడతల్లో 93 పాఠశాలలకు జీవం పోసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



బాలికోన్నత పాఠశాలలో మధ్యలో నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణం



తెనాలి గంగానమ్మపేటలో టీఎస్ఆర్ఎం స్కూల్‌లో పునాదితో ఆగిన నిర్మాణం



అంగలకుదురులోని ప్రభుత్వ పాఠశాలలో నిలిచిన నిర్మాణ పనులు

తెనాలిఅర్బన్: అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని అన్న చందాన నాడు–నేడు పథకం తయారైంది. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దాలనే లక్ష్యానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రధానోపాధ్యాయుల బ్యాంక్ ఖాతాలకు నిధులు విడుదల చేసిన వాటిని ఎలా ఉపయోగించాలనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో పనులు నేటికీ పూర్తి కాలేదు. తెనాలి పట్టణం, మండల పరిధిలో 99 ప్రభుత్వ పాఠశాలు ఉన్నాయి. వాటిలో మౌలిక వసతుల కల్పన చేయటంతో పాటు కార్పొరేట్ స్థాయిలో అందంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి నాడు-నేడు పథకాన్ని 2019లో ప్రవేశపెట్టారు. మొదటి విడత కింద తెనాలి పట్టణం, మండల పరిధిలో 45 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి అదనపు తరగతి గదుల నిర్మాణం, రక్షిత మంచినీటి ప్లాంట్ ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, మురుగు నీటి వసతి ఏర్పాటు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం, ఎలక్ట్రికల్ వర్క్, గ్రీన్ చాక్ బోర్డు, ఫర్నిచర్, పెయింటింగ్స్, మేజర్, మైనర్ రిపేర్లు చేశారు. మొదటి విడత పనులను 14 మార్చి 2022లో పూర్తి చేశారు. అనంతరం రెండోవ విడత కింద మరో 48 పాఠశాలను ఎంపిక చేసి వాటి పనులు 2023 మార్చిలో ప్రారంభించి డిసెంబర్ వరకు కొనసాగించారు.

రూ.28.40 కోట్ల నిధులు!

నాడు–నేడు పథకం కింద మొదటి విడత ఎంపికైన 45 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం గత ప్రభుత్వం రూ.10.14 కోట్ల నిధులను వెచ్చించింది. అలాగే రెండవ విడత ఎంపిక చేసిన 48 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.18.26 కోట్ల నిధులను వెచ్చించి అభివృద్ధి చేసింది. అంటే రెండు విడతలలో ఎంపిక చేసిన 93 పాఠశాలల్లో సుమారు రూ.28.40 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చించినట్లయ్యింది.

నిధులున్నా.. నత్తనడకే!

2024 ప్రారంభంలో ఎన్నికల కోడ్ రావటంతో ఉన్నతాధికారులు నాడు–నేడు పనులు నిలిపివేశారు. దీంతో స్కూల్స్‌లో జరుగుతున్న నిర్మాణ పనులు, నిర్మాణాలు పూర్తి అయిన గదులకు తలుపులు, కిటికీలు, ఇతర ఫ్లోరింగ్ పనులు వంటివి నిలచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు పునరుద్ధరించకపోగా నిధుల విడుదలను 2025 మార్చి వరకు నిలిపివేసింది. గత నెల మొదట్లో స్కూల్ ప్రధానోపాధ్యాయుల బ్యాంక్ ఖాతాలలో కొంత నగదును జమ చేసింది. ఇలా జరిగి నెల దాటుతున్న నేటికీ వాటిని దేని కోసం ఉపయోగించాలనే దానిపై విధివిధానాలు ప్రకటించ లేదు. దీంతో ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఏమి చేయలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి నిధులు వినియోగంపై స్పష్టత ఇవ్వడంతో పాటు వేసవి సెలవుల్లో పనులు పూర్తి చేయిస్తే వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

నిధుల వినియోగంపై స్పష్టత రాలేదండీ



ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులు నిలచిపోయిన మాట వాస్తవం. గత నెల లో కొంత నిధులు విడుదల అయ్యాయి. అయితే వాటిని ఎలా ఉపయోగించాలనే దానిపై ఇంకా మాకు స్పష్టత రాలేదు. అది రాగానే పనులు పునఃప్రారంభిస్తాం. వేసవి సెలవులు ముగిసే లోపు పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం.

–వి జయంతి బాబు,
మండల విద్యాధికారి–2, తెనాలి.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

మంగళగిరి: మంగళగిరి, కృష్ణా కెనాల్ జంక్షన్‌ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. గుంటూరు జీఆర్‌పీ ఎస్ఐ లక్ష్మీనారాయణ రెడ్డి ఘటనపై వివరాలను వెల్లడించారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు సోమవారం సమాచారం అందించారన్నారు. దీంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని.. సిమెంట్ రంగు కాటన్ చొక్కాపై తెలుపు రంగు డిజైన్.. నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించివున్నట్లు తెలిపారు. ఎవరైనా సదరు వ్యకిని గుర్తిస్తే జీఆర్‌పీ పోలీసులను సంప్రదించాలని కోరారు.

ప్రతిభావంతులకు సన్మానం



దుగ్గిరాల: ప్రభుత్వ యస్.వి.వి.జి. జిల్లా ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ సోమవారం సన్మానించారు. గొడవర్తి రేష్మ 531.. వాసిరెడ్డి ఆశ్రిత 523.. పల్లెపు సీతామహ లక్ష్మీ 518.. కొండూరి మేఘ శ్యామల 514.. నల్లూరి గంగాధర్ 514.. కొండూరు సందీప 505 మార్కులు సాధించారని ఉపాధ్యాయులు తెలిపారు. గ్రామ సర్పంచ్ పి.కృష్ణ ప్రసాద్, హెచ్ఎం పి.రామారావు విద్యార్థులకు నగదు అందజేసి అభినందిచారు.

సరుకుల పంపిణీ

మంగళగిరి టౌన్: పాత మంగళగిరిలోని షేక్ రిహాన్ అనే 9 ఏళ్ల బాలుడు ఇటీవల బాణాసంచా ప్రమాదంలో శరీరం కాలిపోయి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న విజయ హెల్త్‌కేర్ ట్రస్ట్ వారు సోమవారం ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



వనమా బాల వజ్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

తాడికొండ: పదవులకు ఎంపికైన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్) అన్నారు. సోమవారం గుంటూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఫిరంగిపురం, మేడికొండూరు మండలాలకు చెందిన నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెరికల చిన్నారు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు దాచేపల్లి నరేంద్ర కుమార్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షురాలు దెబోరా, మైనార్టీ విభాగం నాయకులు షేక్ రబ్బానీలు ఇన్‌చార్జిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తమవంతు కష్టపడి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో మేడికొండూరు, ఫిరంగిపురం మండల పార్టీ అధ్యక్షులు తాళ్లూరు వంశీ, మార్పుల శివరామిరెడ్డి, వివిధ విభాగాల, సీనియర్ నాయకులు కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, దాసరి సురేష్, పాడపాటి అంజిరెడ్డి, షేక్ మస్తాన్ వలి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, సేవా నాగరాజు, చేవూరి రామ్మోహన్ రెడ్డి, కొమ్మారెడ్డి ప్రవీణ్ రెడ్డి, రేపూడి రంజన్ బాబు, బోయినపల్లి సాల్మన్, మాయకుంట్ల రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కిరాణా షాపులో చోరీ

మేడికొండూరు: పేరేచర్లలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దొంగలు హల్‌చల్ చేశారు. పేరేచర్ల రతనపల్లి రోడ్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు పక్కనే ఉన్న కాంప్లెక్స్‌లోని కిరాణా షాపులో గుర్తు తెలియని వ్యక్తులు గల్లాపెట్టెలోని రూ.9 వేలు చోరిచేశారు. షాపు పైన ఉన్న రేకులను తొలగించి వ్యక్తి షాపులోకి దిగినట్లు పోలీసులు నిర్ధారించారు. చోరి జరిగిన షాపును మేడికొండూరు సీఐ షేక్ నాగూర్ మీరా సాహెబ్ పరిశీలించారు. షాపు యజమాని మద్ది నరేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గతంలోనూ చోరీలు జరిగాయని.. నియంత్రణకు పోలీసులు నిఘాను పెంచి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.